# సిద్దిపేట సంగారెడ్డి మెదక్



మంగళవారం 11 ఆగస్టు 2026 పేజీలు : 8


## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



# 15న సంగారెడ్డికు సీఎం రాక



**ఆగస్టు 15న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్., జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**



## ప్రధాన రహదారిపై భారీ గోతితో ప్రమాదం?

**మురుగు కాలువ నీరు రోడ్డుపైకి..**

**వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**

**కల్హే ర్.10.ఆగస్టు. ప్రజా జ్యోతి**

మండల కేంద్రం: కల్హే ర్.మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - మిగతా3లో



## 2017 రాహుల్ గాంధీ సభ సక్సెసే నాపై కుట్రకు కారణం..

బీఆర్ఎస్, హరీష్ రావులపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన ఆరోపణలు!

నాపై పీడీ యాక్ట్ పెట్టి ఏడాది పాటు జైలుకు పంపాలని ప్లాన్ చేశారు..

సంగారెడ్డి బీఎల్ఏల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన జగ్గారెడ్డి.

నా అప్పులని ఆసరాగా చేసుకుని కేసులు పెట్టించే యత్నం చేశారు..

హరీష్ రావును తప్పుపట్టను కానీ, కేసీఆర్ సీరియస్ కావడంతోనే నన్ను టార్గెట్ చేశారని వెల్లడి.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన

# కలెక్టర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ఎస్పీ





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** సంగారెడ్డి పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. సీఎం పర్యటించనున్న సభా ప్రాంగణాలను, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సంగారెడ్డి పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. సీఎం సభలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్న స్థానిక అంబేద్కర్ స్టేడియం, తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ పర్యటనకు భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్ మరియు సభా వేదిక నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చించారు.సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ అధికారులు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ మరియు పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ లో జైల్ భరో సందర్భంగా రాస్తారోకో



**హత్నూర 10ఆగష్టు** మండల పరిధిలో దౌల్తాబాద్ అంబేద్కర్ చెవురస్తా దగ్గర సోమవారం నాడు జైల్ బరో సందర్భంగా రాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు హత్నూర మండల నాయకులు కోనంపేట శేఖర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి జిబి గ్రామ్ జి చట్టాలు రద్దు చేయాలని కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వం దేశాన్ని మొత్తం ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ధారా దత్తం చేస్తుందని కార్మికులను కట్టు బానిసలుగా చేసి పని గంటల పెంపుతో గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా సవరించి మరోపక్క కార్మిక వర్గానికి నష్టం చేస్తున్న ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి అని విద్యుత్తు విత్తన సవరణ బిల్లులను రద్దు చేయాలి ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు మరియు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి కనీస వేతనం కార్మికులకు ఇవ్వాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు షబ్బీర్,మంగ మహిపాల్,విజయ వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై నిరంతరం పోరాడుతాం

## టిడబ్ల్యూజెయఫ్ కార్యదర్శి సత్యం



**జిన్నారం( ప్రజాజ్యోతి)** జర్నలిస్టుల సమస్యలపై యూనియన్లకు అతీతంగా నిరంతరం పోరాడతామని పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి కొత్తకొండ సత్యం అన్నారు. సోమవారం నాడు జిన్నారం మున్సిపల్ కేంద్రంలోపలువురు సీనియర్ జర్నలిస్టులు ఇటీవల పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మూడో మహాసభలో కార్యదర్శిగా తిరిగి కొత్తకొండ సత్యం ఎన్నికైన సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సత్కరించి శుభకాంక్షలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ మా యొక్క ఫెడరేషన్ సంఘంపై అభిమానంతో మమ్మల్ని సత్కరించిన జర్నలిస్టులకు పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డివిజన్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్,మహేష్ గౌడ్,విజయ్, జింకల శ్రీనివాస్, మున్నీ శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

## మెదక్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ల వద్ద సిసి రోడ్ నిర్మాణ పూర్తి





**మెదక్ (ప్రజాజ్యోతి)** టిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు తలపెట్టినటువంటి డబుల్ బెడ్ రూమ్ వద్ద రోడ్ ఎంతో కాలంగా వర్షాలు పడితే బురదమయంగా మారుతుండే అయినటువంటి రోడ్డు కు ఇన్ని రోజులకు మార్దశ వచ్చింది. మెదక్ పట్టణంలో 12 వ వార్డు పిల్లికోటల ప్రాంతానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ లకు చెందిన వ్యక్తి మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఉన్నప్పటికీ అక్కడ సిసి రోడ్ నిర్మానించలేని పరిస్థితి ఇప్పుడు మహర్దశ వచ్చింది సిసి రోడ్ నిర్మాణానికి ఒక కోటి 63 లక్షలతో నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది.

## సికింద్లాపూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ని దర్శించుకున్న న్యాయమూర్తి హేమలత

**--కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు.**



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 10:** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామం పరిధిలో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి హేమలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి విశిష్టతను వివరించి న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి సారా శ్రీనివాస్,ఆలయ ప్రధాన అర్చకులు ధనంజయ శర్మ,జూనియర్ సహాయకులు నరసింహారెడ్డి,శివ్వంపేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 15న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్., జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఈ నెల 15న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్.,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. సంబంధిత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సమావేశం నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం, హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం తారా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంజీ మైదానం తదితర ప్రాంతాలను వారు సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. సమావేశ ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ లు ఆదేశించారు.

# ప్రజా సమస్యలపై సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జైల్‌భరో





**-నాగల్‌గిద్దలో కార్మికుల నిరసన -అరెస్టు చేసిన పోలీసులు**

**-అక్రమ అరెస్టులకు భయపడేది లేదు**

**-కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొఠారి నర్సింలు**




నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 10: కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొఠారి నర్సింలు, సీఐటీయూ మండల నాయకుడు గణపతి ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగల్‌గిద్దలో నిరసన చేపట్టారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం కార్మికుల ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో యువత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి 'వీబీజీ రామ్‌జీ' పేరుతో ఉపాధి కూలీలను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం సరికాదని, అక్రమ అరెస్టులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నిర్మల, సంగీత, సవిత, సురేఖ, జ్యోతి, అల్వేణి, విద్యావతి, రుక్మిణి, తూకారం, సాయి, దాస్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లిలో ఘనంగా బోనాల పండుగ



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 10:** శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు,బోనాల సమర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్,మాజీ సర్పంచ్,ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి,మాజీ సర్పంచ్ పెంజర్ల శ్రీనివాస్ యాదవ్,సీనియర్ వార్డు సభ్యుడు బోళ్ల సదానంద్,ముదిరాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యు.వెంకటేష్ గౌడ్,చిట్టబోయిన మహేందర్ యాదవ్,బజారి మహేందర్ రెడ్డి,యు. సత్యనారా యణ గౌడ్,ఎం.రవి ముదిరాజ్,బోయిని సత్యనారాయణ, జి.లక్ష్మీనారాయణ,ఎం.అశోక్,టీ.ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులను ఛేదించిన త్వరగా ఎస్సై మధుకర్‌రెడ్డికి ఘన సన్మానం



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 10:** పోలీసుల సమర్థతను అభినందించిన పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, పిల్లుట్లగ్రామంలో ఇటీవల జరిగిన పలు దొంగతనం కేసులను అత్యంత వేగంగా,వ్యూహాత్మకంగా ఛేదించి నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన స్థానిక ఎస్సై మధుకర్‌రెడ్డిని పిల్లుట్ల గ్రామ సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, యువ నాయకుడు బొమ్మిరాల శంకర్ ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ మాట్లాడుతూ.. దొంగతనాలకు గురైన బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు, నిందితులను పట్టుకోవడంలో పోలీసులు చూపిన చొరవ,సమర్థత అభినందనీయమన్నారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రజల ఆస్తులు,భద్రతకు రక్షణగా నిలుస్తున్న పోలీసు యంత్రాంగానికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్ల స్వామి యాదవ్,గొల్ల మల్లేష్,పిల్లి కిష్టయ్య,కన్నయ్యతో పాటు పలువురు యువకులు పాల్గొని ఎస్సై మధుకర్‌రెడ్డి,పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# 2017 రాహుల్ గాంధీ సభ సక్సెసే నాపై కుట్రకు కారణం..

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సంగారెడ్డి రాజకీయాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభ విజయవంతం కావడం వల్లే తనను రాజకీయంగా తొక్కిపెట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యంగా హరీష్ రావు కుట్రలు చేశారని జగ్గారెడ్డి ఆరోపించారు. పీడీ యాక్ట్ కింద తనను జైలుకు పంపించేందుకు విఫలయత్నం చేశారని, చివరకు అక్రమంగా పాస్‌పోర్ట్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ బీఎల్ఏల ముగింపు సమావేశంలో జగ్గారెడ్డి వెల్లడించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏల ముగింపు సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన విషయాలను బయటపెట్టారు. 2017లో అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరిక మేరకు సుమారు 3 లక్షల మందితో రాహుల్ గాంధీ సభను నిర్వహించానని జగ్గారెడ్డి గుర్తుచేశారు. ఈ సభ కోసం రూ.6.5 కోట్ల అప్పు తీసుకున్నానని, సభ గ్రాండ్ సక్సెస్ కావడం అప్పటి కేసీఆర్ సర్కార్‌కి మింగుడు పడలేదని పేర్కొన్నారు. సభ విజయవంతం కావడంతో కేసీఆర్ సీరియస్ అయ్యారని, ఆ క్రమంలోనే హరీష్ రావు తనను రాజకీయంగా టార్గెట్ చేశారని ఆరోపించారు. తనపై అక్రమాస్తులు, భూ వ్యవహారాల పేరుతో విజిలెన్స్ విభాగానికి చెందిన ఐపీఎస్, నలుగురు డీఎస్పీలతో విచారణ జరిపించారని, కానీ తన వద్ద ఎలాంటి అక్రమాస్తులు లేవని తేలిపోయిందని జగ్గారెడ్డి చెప్పారు. దాదాపు 40 పిటిషన్లు వేయించి, పీడీ యాక్ట్ కింద తనను ఏడాది పాటు జైలుకు పంపాలని చూశారని మండిపడ్డారు. తనకు అప్పు ఇచ్చిన వారితో కరపత్రాలు వేయించి, కేసులు పెట్టించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని.. కానీ రుణాలు ఇచ్చిన వారు ఫిర్యాదు చేయడానికి నిరాకరించడంతో ఆ కుట్రలు



విఫలమయ్యాయని వెల్లడించారు. హోంమంత్రి కార్యాలయంలో సమావేశాలు పెట్టినా పోలీసులు కేసు నమోదు సాధ్యం కాదని చెప్పడంతో, చివరికి పాస్‌పోర్ట్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని ఆవేదన చెందారు. మెడికల్ కాలేజీ పోరాటం నుంచి పీడీ యాక్ట్ కుట్రల వరకు పడిన కష్టాలను ఇప్పటివరకు కుటుంబ సభ్యులకు గానీ, రాహుల్ గాంధీకి గానీ చెప్పలేదని.. కేవలం కార్యకర్తలకు, ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఇప్పుడు బయటపెడుతున్నానని తెలిపారు. అయితే తాను రివెంజ్ పాలిటిక్స్ చేయనని, హరీష్ రావును నిందించనని.. కేవలం రియల్ పాలిటిక్స్ మాత్రమే చేస్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. నా ఆట, పాటలనే ఇన్నాళ్లు చూశారు.. నా ఆవేదన, బాధలను నేను ఒక్కడినే అనుభవించాను. రివెంజ్ పాలిటిక్స్ కి నేను దూరం.. రియల్ పాలిటిక్స్ చేస్తా..." ఇన్నాళ్లూ తన మనసులోనే దాచుకున్న ఆవేదనను సంగారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తల వేదికగా జగ్గారెడ్డి బయటపెట్టడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జగ్గారెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 10:** మానూర్ మండలం కమలాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దిగంబర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ వెంకట్ రావు, బాలాజీ రావు, దొండి రావు, మానూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకాష్ పాటిల్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉపాధి హామీ అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై భారీ గోతితో ప్రమాదం .?

-మొదటిపేజీ తరువాయి



దీనికి తోడు మురుగు కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ప్రధాన కాలువపై ఏర్పడిన పెద్ద గుంత కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రహదారి జిల్లా కేంద్రం, మండల కేంద్రం, , పొరుగు జిల్లా పిట్లం వెళ్లాలంటే ఇదే రహదారి స్టేట్ బ్యాంక్ తదితర ముఖ్య ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగింది. ఇప్పటికే రహదారిపై మురుగు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు గుంతను గుర్తించడం కష్టంగా మారుతోంది. పెద్ద ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి, రహదారిపై ఏర్పడిన గుంతను వెంటనే పూడ్చడంతో పాటు మురుగు కాలువ నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## నియో ప్రగతి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆషాఢమాస బోనాల ఉత్సవాలు








**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 10:** ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని నియో ప్రగతి ఉన్నత పాఠశాలలో సోమవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సతీమణి సుశీల విశ్వనాథ్, పాఠశాల కరస్పాండెంట్ కమ్మరి వెంకటరత్నం, ప్రిన్సిపల్ కమ్మరి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

-కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలిగే జీవన్ డిమాండ్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 10:** దళిత క్రైస్తవుల హక్కులను హరిస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హైకోర్టు న్యాయవాది, ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలిగే జీవన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ ధర్నా చౌక్‌లో ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, వారికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన దళిత క్రైస్తవులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.